సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 13 । మే । 2025



చర్యలు తీసుకోవాలి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.

- 8లో ▸



26 ఏళ్లుగా..

బాన్సువాడకు చెందిన నాగులగామ వెంకన్న 26 ఏళ్లుగా వేసవిలో అంబలి కేంద్రం ద్వారా సేవలందిస్తున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
40.9 /20.9

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జొన్నల తరలింపు



సాక్షి ఎఫెక్ట్..

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంనుంచి తూకం వేసిన జొన్నలను సోమవారం తరలించారు. ఐదు రోజులుగా లారీలు రాకపోవడంతో ఎక్కడి జొన్నలు అక్కడే పేరుకుపోతున్న విషయమై సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై సొసైటీ, మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించారు. సోమవారం ఉదయం కొనుగోలు కేంద్రానికి లారీలు తెప్పించి కాంటా పూర్తయ్యి, నిల్వ ఉన్న జొన్నలను లోడ్ చేయించి తరలించారు. దీంతో తూకాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని అధికారులు పేర్కొన్నారు. సొసైటీ పరిధిలో ఇప్పటివరకు 64,246 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేశామని తెలిపారు. మరో 20 వేల క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశాలున్నాయని వేస్తున్నామన్నారు.

నేడు పాలిసెట్

కామారెడ్డి అర్బన్ : పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకోసం మంగళవారం నిర్వహించే పాలిసెట్‌కు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ విషయాన్ని పాలిసెట్ జిల్లా సమన్వయకర్త, కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2,900 మంది అభ్యర్థుల కోసం జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల, సాందీపని కళాశాలల్లో రెండేసి పరీక్ష కేంద్రాలు, ఎస్ఆర్‌కే, శ్రీఆర్యభట్ట కళాశాలల్లో ఒక్కో కేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎట్టి పరిస్థితిల్లోనూ ఉదయం 11 గంటలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యం అయినా లోనికి అనుమతి ఉండదని పేర్కొన్నారు.

16 నుంచి డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెగ్యులర్ 2, 4, 6వ సెమిస్టర్, బ్యాక్‌లాగ్ (2020 నుంచి 2024 బ్యాచ్‌లకు) 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 16 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి (కంట్రోలర్) ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించిన విధంగా ఈ నెల 14న ప్రారంభం కావాల్సిన డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను అనివార్య కారణాలతో 16వ తేదీకి వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. తెయూ పరిధిలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 32 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 24,500 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inను సంప్రదించాలని కంట్రోలర్ సూచించారు.

'ఏకలవ్య'లో ఖాళీ సీట్ల భర్తీ

ఇందల్వాయి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఏకలవ్య మోడల్ స్కూల్ గాంధారి (బాయ్స్), ఇందల్వాయి (గర్ల్స్)లలో 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకోసం ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఇందల్వాయి) ప్రిన్సిపల్ రమేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధారిలో బైపీసీలో 23, సీఈసీలో 14 ఖాళీలు, ఇందల్వాయిలో బైపీసీలో 15, సీఈసీలో 18 సీట్లు ఖాళీ ఉన్నట్లు వివరించారు. పదో తరగతి మెరిట్ ఆధారంగా, నెస్ట్ అడ్మిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

మరోసారి ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగింపు

నిజామాబాద్ సిటీ : ఎల్‌ఆర్‌ఎస్‌పై గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పెంచింది. లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం ద్వారా అనధికార లేఅవుట్‌లను రెగ్యులరైజ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. మొదట మార్చి 31తో గడువు ముగియగా.. దానిని ఏప్రిల్ 30 వరకు పొడిగించారు. తర్వాత ఈనెల 3వతేదీ వరకు అవకాశం ఇచ్చారు. తాజాగా ఈ గడువును మరోసారి పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం జీవో నం.97 జారీ చేసింది. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తుదారులు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం కల్పించింది. సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఈ పథకాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

తక్కువ విద్యార్థులున్న కళాశాలల వివరాలు..

కళాశాల	విద్యార్థులు (సెకండియర్)	కళాశాల	విద్యార్థులు (సెకండియర్)
		భిక్కనూరు	34
బీబీపేట	00	బీర్కూర్	57
నాగిరెడ్డిపేట	45	మద్నూర్	86
నిజాంసాగర్	13	జుక్కల్	68

లెక్చరర్లు తక్కువగా ఉన్న కళాశాలలు..

కళాశాల	లెక్చరర్ల సంఖ్య	కళాశాల	లెక్చరర్ల సంఖ్య
బీబీపేట	01	నాగిరెడ్డిపేట	02
నిజాంసాగర్	01	బీర్కూర్	04

ఫలితాలిలా.. ప్రవేశాలెలా?

- సర్కారు జూనియర్ కళాశాలల్లో పడిపోతున్న ఉత్తీర్ణత
- ప్రవేశాలకు ఆసక్తి చూపని విద్యార్థులు
- ఖాళీగా మిగిలిపోతున్న సీట్లు

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. ఉత్తీర్ణతలో అట్టడుగున నిలుస్తుండడంతో ఆయా కళాశాలల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఆర్థికంగా భారమైనా ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివించడానికే ప్రజలు మొగ్గు చూపుతుండడంతో ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో సీట్లు మిగిలిపోతున్నాయి.

కామారెడ్డి టౌన్ : ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ నడుస్తోంది. ఈనెల ఒకటో తేదీనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ ప్రక్రియ నెలాఖరు వరకు కొనసాగనుంది. ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షలలో 11,871 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిని ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించడం కోసం లెక్చరర్లు ఇంటింటికి వెళ్తున్నారు.

ఫలితాల్లో అట్టడుగున..

ఇంటర్ ఫలితాల్లో జిల్లా వెనకబడి ఉంది. ఫస్టియర్‌లో 50.09 శాతం, సెకండియర్‌లో 56.38 శాతం ఉత్తీర్ణత సాధించి, రాష్ట్రంలోనే అట్టడుగు స్థానంలో నిలిచింది. సరైన వసతులు లేకపోవడం, లెక్చరర్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో సగం మంది వరకు ఫెయిల్ అవుతున్నారు. వరుసగా రెండేళ్లుగా ఫలితాల్లో చిట్టచివరన ఉండడంతో ప్రభుత్వ కళాశాలలపై నమ్మకం సడలుతోంది. ఇది అడ్మిషన్లపై ప్రభావం



భిక్కనూరులో విద్యార్థినితో మాట్లాడుతున్న లెక్చరర్లు

చూపుతోంది. లెక్చరర్ల పోస్టులు 244 ఉండగా.. ఇరవైకిపైగా ఖాళీలున్నాయి.

ఆసక్తి చూపని విద్యార్థులు..

జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ ఒక్కో సెక్షన్‌కు 44 సీట్లున్నాయి. జిల్లాలోని అన్ని కళాశాలల్లో కలిపి ఫస్టియర్‌లో 2,816, సెకండియర్‌లో 2,816 సీట్లున్నాయి. అయితే ఇవి పూర్తి స్థాయిలో భర్తీ కావడం లేదు. 2023–24 విద్యాసంవత్సరంలో ఫస్టియర్‌లో 2,103 మంది, సెకండియర్‌లో 2,599 విద్యార్థులుండగా.. 2024–25 విద్యాసంవత్సరంలో ఫస్టియర్‌లో 1,993 మంది, సెకండియర్‌లో 2,447 మంది మాత్రమే ఉన్నారు. గతేడాది ఫస్టియర్‌లో 8 వందలకుపైగా సీట్లు ఖాళీగా ఉండడం గమనార్హం.

అడ్మిషన్ల కోసం లెక్చరర్ల పాట్లు

జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వాటిలో అడ్మిషన్ల కోసం లెక్చరర్లు శ్రమిస్తున్నారు. కళాశాల పరిధిలోని గ్రామాలకు వెళ్లి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. సర్కారు కళాశాలల్లో వసతుల గురించి వివరిస్తున్నారు. తమ కళాశాలలో చేరాలని కోరుతున్నారు. అయితే చాలా మంది సర్కారు కాలేజీలలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. పేద, దిగువ మధ్య తరగతి విద్యార్థులు కొందరు మాత్రమే సర్కారు కళాశాలల వైపు చూస్తున్నారు.



బస్వాపూర్‌లో అడ్మిషన్ల కోసం లెక్చరర్ల ప్రచారం

అడ్మిషన్లు బాగానే వస్తున్నాయి



జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు లెక్చరర్లు కృషి చేస్తున్నారు. ఇప్పటికే లెక్చరర్లు తమ పరిధిలోని గ్రామాలు, వార్డులకు వెళ్లి సర్వే చేస్తూ, సర్కారు కాలేజీల గురించి ప్రచారం చేస్తున్నారు. అడ్మిషన్లు బాగానే వస్తున్నాయి.

– షేక్ సలాం, ఇంటర్ నోడల్ అధికారి, కామారెడ్డి



అచ్చాయపల్లిలో గాలివాన



గాలివానకు ఎగిరిపోయి కరెంట్ స్తంభాలకు తాకిన రేకులు

గాలివాన బీభత్సం

అచ్చాయపల్లిలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన గాలులకు ఇళ్ల పైకప్పు రేకులు కొట్టుకుపోయాయి. విద్యుత్‌వైర్లు తెగి కిందపడ్డాయి. గ్రామంలో చెట్టు నేలకూలింది. ఓ ఇంటి రేకులు కొట్టుకుపోయి విద్యుత్ తీగలపై పడ్డాయి. ట్రాన్స్‌కో సిబ్బంది గ్రామానికి చేరుకొని మరమ్మతులు చేశారు.

– నాగిరెడ్డిపేట

తాగునీటి కోసం ఆందోళన

బాన్సువాడ రూరల్ : కొత్తాబాది గ్రామంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గ్రామానికి నీటిని సరఫరా చేసే రెండు బోర్లు ధ్వంసం అయ్యాయని, వాటిని నేటికి పునరుద్ధరించలేదని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ సైతం ధ్వంసం కావడంతో తాగునీటికి ఇబ్బంది ఏర్పడిందన్నారు. రహదారి విస్తరణ పనులు సైతం నత్తనడకన, నాసిరకంగా కొనసాగుతున్నాయని ఆరోపించారు. రాస్తారోకోతో బాన్సువాడ –ఎల్లారెడ్డి రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న బాన్సువాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి గణేశ్ హామీ ఇచ్చారు.



కొత్తాబాదిలో రాస్తారోకో చేస్తున్న మహిళలు

హోరాహోరీగా కుస్తీ

అయిలాపూర్ దుర్గామాత ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. టెంకాయ కుస్తీ నుంచి మొదలైన పోటీలు.. వెండి కడెం కుస్తీ వరకు సాగాయి. మల్లయోధులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు ఆలయ కమిటీ సభ్యులు నగదు బహుమతులు, వెండి కడియాలు బహూకరించారు. పోటీలను వందలాది మంది వీక్షించారు. – లింగంపేట



కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

సీసీ కెమెరాల ప్రాధాన్యతను గుర్తించాలి

కామారెడ్డి క్రైం: ప్రతిఒక్కరు సీసీ కెమెరాల ప్రాధాన్యతను గుర్తించాలని ఏఎస్పీ చైతన్యరెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీ డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో ఉన్న వారందరూ దిగువ, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ప్రజలే అయినప్పటికీ కలసికట్టుగా ముందుకు వచ్చి రూ. 2 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. పోలీసులకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మిగతా కాలనీల ప్రజలు సైతం స్వచ్ఛందంగా



సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న ఏఎస్పీ

ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై శ్రీరామ్, సిబ్బంది కమలాకర్‌రెడ్డి, విశ్వనాథ్, అజర్, సంపత్, నర్సారెడ్డి, కాలనీవాసులు రాజు, ముజాహిద్, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు చెల్లించక వేటకు దూరం

- కౌలాస్ ప్రాజెక్టులో వేటపై ఆంక్షలు విధించిన అధికారులు
- ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు
- రేపు వేలం నిర్వహణకు ఏర్పాట్లు



కౌలాస్ ప్రాజెక్టు

నిజాంసాగర్: కౌలాస్ నాలా ప్రాజెక్టులో చేపల వేటకు సంబంధించిన కౌలు ఐదేళ్లుగా చెల్లించకపోవడంతో.. చేపట వేటపై వేలం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో మత్స్యకారులు వేటకు దూరం కావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. జుక్కల్ మండలంలోని కౌలాస్ నాలా ప్రాజెక్టుపై ఆధారపడి తొమ్మిది గ్రామాల మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. కౌలాస్ మత్స్యసంఘం పరిధిలో కౌలాస్, సావర్‌గావ్, లింగంపల్లి, వజ్రకండి, సోపూర్, బాబుల్‌గావ్, విఠల్‌వాడి, చింతల్‌వాడి, డోన్‌గావ్ గ్రామాలున్నాయి. ఈ సంఘంలో 160 మత్స్యకార్మిక కుటుంబాలు సభ్యులుగా ఉన్నాయి. వీరిలో చాలామంది చేపల వేటపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. కాగా ప్రాజెక్టులో చేపల పెంపకానికి సంబంధించి ఏటా రూ. 72,600 వేల చొప్పున మత్స్యకార్మికులు ప్రభుత్వానికి కౌలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే చేపలు పెంచి, ఉపాధి పొందుతున్న కార్మికులు ఐదేళ్లుగా వివిధ కారణాలతో కౌలు చెల్లించడం లేదు. చేపల వ్యాపారంలో దళారుల పాత్ర పెరగడం, మత్స్యకారులకు కూలి గిట్టుబాటు కాకపోవడం, పలువురు మత్స్యకారులు వేరే పనుల నిమిత్తం వలస వెళ్లడం, ఉన్నవారిలోనూ ఐక్యత లేకపోవడం తదితర కారణాలతో కౌలు చెల్లించడానికి ఐదేళ్లుగా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఐదేళ్లకు సంబంధించి బకాయిలు రూ. 3.63 లక్షలకు చేరాయి. ఈ బకాయిలను చెల్లించాలని మత్స్యకార్మిక సొసైటీ సభ్యులకు మత్స్యశాఖ అధికారులు గతేడాది జూన్‌లో నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ బకాయిలు చెల్లించడానికి సొసైటీ సభ్యులు ముందుకు రాలేదు. ఈ విషయాన్ని మత్స్యశాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కౌలాస్ మత్స్య సొసైటీ పరిధిలోని మత్స్యకారులు కౌలాస్ నాలాలో చేపలు వేటాడరాదని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా చేపల వేట కోసం వేలం నిర్వహించాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. దీంతో ఇన్నాళ్లు ప్రాజెక్టును నమ్ముకుని బతుకుతున్న మత్స్యకారులు ఉపాధికి దూరం కానున్నారు.

వేలంలో దక్కించుకున్నవారికే వేటకు అవకాశం



కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలతో బుధవారం కౌలాస్ నాలాలో చేపల వేటపై వేలం పాట నిర్వహించాలని నిర్ణయించాం. అచ్చంపేట మత్స్యశాఖ కార్యాలయంలో వేలం ఉంటుంది. ఐదేళ్ల కౌలు బకాయి డబ్బులకు అదనంగా వేలం పాట పాడిన వారికి చేపల వేటను అప్పగిస్తాం. కౌలాస్ మత్స్య సొసైటీ సభ్యులు కౌలు చెల్లించనందున చేపలు పట్టరాదు. పాత సొసైటీ పరిధిలోని గ్రామాల మత్స్యకార్మికులు చేపలు పడితే కేసులు నమోదు చేస్తాం.

– డోలిసింగ్, ఎఫ్‌డీవో, నిజాంసాగర్

తడిసి మోపెడు!

నెలవారీ ఖర్చులకు రెక్కలు

- ఎండలతో పాటే పెరిగిన కరెంటు వాడకం
- నీళ్ల కొనుగోలుకు అదనపు వ్యయం..
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వేసవి ఎండలతోపాటే కుటుంబ ఖర్చులూ పెరిగాయి. సెలవులతో పిల్లలంతా ఇంటికి చేరడం, ఇదే సమయంలో విద్యుత్ వాడకం, నీటి వినియోగం పెరిగి వాటికి అయ్యే వ్యయం రెట్టింపయ్యింది. అలాగే కూరగాయలు, మాంసం కొనుగోలు ఎక్కువైంది. గ్యాస్ వినియోగం ఎక్కువయ్యింది. ప్రధానంగా పట్టణాల్లో ఖర్చులు భారీగా పెరిగాయి. నెలరోజుల్లో ఇంటి ఖర్చులు రెట్టింపయ్యాయని జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో నివసించే మధ్య తరగతి ప్రజలు పేర్కొంటున్నారు. పట్టణంలో భూగర్భ జలమట్టం పడిపోయి వందలాది బోర్లు ఎత్తిపోయాయి. మున్సిపాలిటీ ద్వారా అప్పుడప్పుడు రెండు డ్రమ్ముల నీటిని సరఫరా చేస్తుంటే అవి ఏ మూలకూ సరిపోవడం లేదు. దీంతో ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక ట్యాంకర్‌కు రూ.550 నుంచి రూ.650 వరకు చెల్లించాల్సి వస్తోంది. నలుగురు ఉన్న కుటుంబానికి వారానికి ఒక ట్యాంకర్ నీరు అవసరం అవుతోంది. ఎండాకాలం మొదలవకముందు అందరి ఇళ్లలో బోర్లు పోసేవి. నీటికి సమస్య ఉండేది కాదు. బోర్లు ఎత్తిపోవడంతో నీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది.

రెట్టింపైన విద్యుత్ బిల్లు..

ఇటీవల విద్యుత్ వాడకం కూడా రెట్టింపయ్యింది. గతంలో రూ.7 వందల నుంచి రూ. వెయ్యి దాకా వచ్చిన కరెంటు బిల్లులు ఇప్పుడు రూ. 2 వేల వరకు వస్తున్నాయి. 2 వందల యూనిట్లలోపు విద్యుత్ వాడుకునే వారికి గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు వస్తుంది. అయితే ఎండాకాలంలో ఇళ్లలో కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు పొద్దస్తమానం నడుస్తున్నాయి. ఇలా విద్యుత్ వినియోగం పెరగడంతో 200 యూనిట్లు దాటుతోంది. దీంతో మొత్తం బిల్లు చెల్లించాల్సి వస్తోంది.

కూరగాయల కొనుగోలు పెరిగింది..


ఇంట్లో కూరగాయల కొనుగోలు కూడా పెరిగింది. అయితే ఈసారి ధరలు అదుపులో ఉండడం కొంత ఊరటనిచ్చే అంశం. పచ్చి మిర్చి కిలోకు రూ.50 నుంచి రూ.60 ఉండగా, టమాట కిలో రూ.10 నుంచి రూ.15కు లభిస్తోంది. బీరకాయ, పాలకూర, తోటకూర, బెండకాయ... కూరగాయలన్నీ దాదాపు కిలో రూ.50 నుంచి రూ.60 వరకు దొరుకుతున్నాయి.

నిత్యావసరాలకు..

సెలవులతో పిల్లలతో పాటు చుట్టాల పిల్లలు కూడా చేరుకోవడంతో ఇళ్లలో నిత్యావసరాల వాడకం పెరిగింది. గతంలో ఇంటి అవసరాలకు సరిపడా నిత్యావసరాలు రూ. 3 వేల నుంచి రూ. 6వేల వరకు కొనుగోలు చేసిన వారు.. ఇప్పుడు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. పిల్లలకు స్నాక్స్, బ్రేక్‌ఫాస్ట్‌ల కోసం రోజూ ఉదయం, సాయంత్రం రకరకాల వంటకాలు చేయాల్సిందే. అలాగే మటన్, చికెన్, చేపలు, కోడిగుడ్ల వాడకం కూడా పెరిగింది. వారంలో ఒకటి రెండు సార్లు మాంసం తింటున్నారు. పిల్లలు రోజూ బాయిల్డ్ ఎగ్గ్, ఆమ్లెట్ తింటుంటారు. పాలు, పెరుగు ఖర్చు కూడా పెరిగింది. గతంలో అర లీటరు నుంచి లీటరు పాలతో వెల్లదీసిన కుటుంబాలు వేసవి సీజన్‌లో లీటరు నుంచి రెండు లీటర్ల వరకు వాడుతున్నాయి. అలాగే నిత్యం ఇంట్లో పెరుగు ఉండాల్సిందే. కనీసం అర లీటరు వాడుకమవుతుంది.

దావత్‌లు అదనం..

వేసవి సెలవుల నేపథ్యంలో చాలా కుటుంబాలు దేవుళ్ల మొక్కులు తీర్చేందుకు పండుగలు చేస్తున్నాయి. దీంతో దావత్‌లకు అయ్యే ఖర్చులు పెరిగాయి. మాంసాహారం వంటలు నడిచే ఆలయాల వద్ద ప్రతి ఆదివారం వందలాది మంది కనబడుతున్నారు. మిగతా వారాల్లోనూ దావత్‌లు దండిగా నడుస్తున్నాయి. దావత్‌లలో మద్యానికి ప్రయారిటీ ఎక్కువే.. దావత్‌లకు వేలాది రూపాయలు ఖర్చవుతున్నాయి. ఇలా వేసవిలో కుటుంబ ఖర్చుల లెక్కలు యాభై శాతం వరకు పెరగడంతో ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.



క్లుప్తంగా

ఎల్లారెడ్డి మైనారిటీ యూత్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మైనారిటీ యూత్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడిగాసయ్యద్ నజీబుల్లాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ జెడ్పీటీసీ గయాజుద్దిన్ సోమవారం తెలిపారు. ఎల్లారెడ్డిలో నూతనంగా మైనార్టీ యూత్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యక్షుడిగా షోయబ్ మోహినోద్దిన్, ఫరూఖ్, ప్రధాన కార్యదర్శిగా అబ్రార్, కోశాధికారిగా అబ్దుల్ రహ్మాన్‌లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గం ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్‌లను కలిసినట్లు వారు తెలిపారు.

మహిళను కాపాడిన కానిస్టేబుల్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సోమవారం ఓ మహిళ తాను చనిపోతానంటూ పరుగెత్తడాన్ని గమనించిన స్థానిక వ్యాపారి పోలీసులకు సమాచారం అందించారు. విధుల్లో ఉన్న కానిస్టేబుల్ శ్రీనివాస్ వెంటనే అప్రమత్తమై నిజాంసాగర్ ప్రధాన కాలువ వైపు పరుగెడుతున్న మహిళను పట్టుకొని నచ్చజెప్పి స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు. మహిళ ప్రాణాలను రక్షించిన కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను ఎస్పీ రాజేష్‌చంద్ర అభినందించారు.

మహిళలే.. పారిశుధ్య కార్మికులు



బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని కో–ఆపరేటివ్ బ్యాంక్ వద్ద మురికి నీళ్లు రోడ్డుపై నుంచి పారుతున్నాయి. చిన్నపాటి వర్షానికే మురికి కాలువ పొంగడంతో చెత్తాచెదారం, మురికి నీరు సమీపంలోని ఇళ్ల ముందు చేరింది. శుభ్రం చేయించాల్సిన పంచాయతీ కార్యదర్శి పట్టించుకోకపోవడంతో మహిళలే పారిశుధ్య కార్మికులుగా మారి పరిసరాలు శుభ్రం చేసుకున్నారు. అధికారులు స్పందించి గ్రామంలోని మురికి కాలువలను శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి అండగా మాజీ ఎమ్మెల్యే

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ పరిధి 44వ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రణీత కుటుంబానికి అండగా నిలవాలని ఆదిలాబాద్ జిల్లా మాజీ మంత్రి జోగు రామన్న సూచించడంతో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ కుటుంబానికి అండగా నిలిచారు. సంబంధిత ఆస్పత్రి సూపరింటెండెంట్, పోలీస్ అధికారులతో మాట్లాడారు. వెంటనే పోస్టుమార్టం జరిపించి బాధిత కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందించారు. దీంతో ప్రణీత కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 76 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 76 ఫిర్యాదులు వచ్చాయి. భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల మంజూరు, రైతు భరోసా, పింఛన్ల మంజూరు తదితర అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించాలన్నారు. పరిష్కారాలకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై తగిన చర్యలు చేపట్టి దరఖాస్తుదారునికి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీవో వీణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం..

ఇటీవల విడుదలైన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సన్మానించారు. పట్టణానికి చెందిన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని బొడ్డుపల్లి నాగ అక్షయ 586, బి హర్షవర్ధన్ 576, ఎస్ మృణాళిని 572, సిహెచ్ జాహ్నవి 562, బి.అలేఖ్య 562, పి.రుతిక 555, బి.రామ్ చరణ్ 554, ఆర్ నిశాంత్ 554 మార్కులను సాధించారు. వారిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, ప్రతినిధులు అన్నపూర్ణ, సంపత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

26 ఏళ్లుగా అంబలి కేంద్రం ఏర్పాటు

- తండ్రి జ్ఞాపకార్థంగా అంబలి వితరణ
- ప్రయాణికులు, ప్రజలు, వాహనదారులకు తీరుతున్న దాహం



బాన్సువాడలో దాహార్తి తీరుస్తున్న అంబలి కేంద్రం

బాన్సువాడ : వేసవిలో బాటసారుల దప్పికను తీర్చాలనే ఉద్దేశంతో పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త నాగులగామ వెంకన్న తన తండ్రి గిర్మయ్య జ్ఞాపకార్థంగా 26 ఏళ్లుగా అంబలి కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు అంబలి వితరణ చేయనున్నారు. 26 ఏళ్లగా తాడ్కోల్ చౌరస్తా వద్ద అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిత్యం చుట్టు పక్కల గ్రామాలు, మండల కేంద్రాల నుంచి జనం ఏదో ఓ పని కోసం బాన్సువాడకు వస్తారు. ప్రతి గురువారం బాన్సువాడలో సంత ఉండడంతో వందలాది గ్రామీణ ప్రాంతాల ప్రజలు వస్తారు. సంతకు వెళ్లాలంటే తాడ్కోల్ చౌరస్తా నుంచే వెళ్లాల్సి ఉంటుంది. సంతకు వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు బస్సులు, ఆటోలలో వచ్చిన ప్రతి ఒక్కరూ ఇక్కడ అంబలి తాగుతారు. ప్రతి రోజు 600 నుంచి 680 గ్లాసుల అంబలి పంపిణీ చేస్తే ప్రతి గురువారం మాత్రం 800 నుంచి 850 గ్లాసులు పంపిణీ చేస్తారు. ప్రతి రోజు 15 –20 కిలోల జొన్న పిండి ఉడకబెట్టి అంబలి చేస్తారు. సంతరోజు మాత్రం 30–35 కిలోల జొన్న పిండిని ఉడకబెట్టి అంబలి తయారు చేస్తారు. ఈ అంబలి కేంద్రం జూన్ మొదటి వారం వరకు కొనసాగుతుంది.

దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో..



మా నాన్న దివంగత గిర్మయ్య జ్ఞాపకార్థం బాన్సువాడలో అంబలి కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి రోజు బాన్సువాడకు వచ్చే పేద ప్రజల దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించాం.
– నాగులగామ వెంకన్న, వ్యాపార వేత్త బాన్సువాడ

దోమకొండలో ఉచిత మెగా వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దోమకొండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రయ్యగారి అనంతరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ తాటిపల్లి శ్రీకాంత్, శివ బాలాజీ సిండికేట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. దాదాపు 600 మందికి ఉచితంగా పలు రకాల పరీక్షలు నిర్వహించి మందులను అందించామని ఆస్పత్రి ఇన్‌చార్జి ఓబుల్‌రెడ్డి తెలిపారు. బీపీ, షుగర్, మోకాల నొప్పులు, నడుము నొప్పులు, దగ్గు, జ్వరం, ఆయాసం,తలనొప్పి, ఆకలి లేకపోవడం, రక్తహీనతతో పాటు ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తిరుమలగౌడ్, మాజీ సర్పంచ్ నల్లపు శ్రీనివాస్, సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిస్సహాయస్థితిలో గుర్తుతెలియని మహిళ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సోమవారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటలకు గుర్తుతెలియని మహిళ నిస్సహాయస్థితిలో పడి ఉండడం చర్చనీయాంశమైంది. మద్యం మత్తులో వివస్త్రగా ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దుస్తులు అందించిన అనంతరం లేపడానికి ప్రయత్నించగా.. 'తనను ఏం చేయొద్దంటూ, ఆధార్ కార్డు ఇవ్వండి మా ఇంటికి వెళ్లిపోతానని' వేడుకుంది. అనంతరం మత్తులోనే నడుచుకుంటూ వెళ్లిపోయింది. దీంతో ఆ మహిళపై ఎవరైనా అఘాయిత్యానికి పాల్పడి ఉంటారేమోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదని పీఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. కాగా, బస్టాండ్ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఘటన విషయం ఎవరి దృష్టికి రాలేదని, పోలీసులు సమగ్ర విచారణ జరిపితే అసలేం జరిగిందో తెలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

మానవసేవకు ప్రతిరూపం నర్సులు

ఎల్లారెడ్డిరూరల్: మానవసేవకు ప్రతిరూపం నర్సులని మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రోగులకు సేవలందిస్తున్న నర్సులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీంద్రమోహన్, కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సామెల్ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఎల్లారెడ్డిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డి/సదాశివనగర్/తాడ్వాయి/రాజంపేట/లింగంపేట/నాగిరెడ్డిపేట : బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పలు చోట్ల స్థానిక కాంగ్రెస్ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. ఎల్లారెడ్డిలోని 8వ వార్డుకు చెందిన పాపిని లింగంకు రూ.10వేల చెక్కు మంజూరు కావడంతో కాంగ్రెస్ నాయకులు అతడి ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు.సదాశివనగర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు మంజూరైన రూ. 23లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను 67మందికి అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సంగారెడ్డి తెలిపారు. తాడ్వాయి మండలం సంగోజీవాడి, కాలోజీవాడి, ఎర్రపహాడ్, చిట్యాల గ్రామాలలో బాధితులకు మంజూరైన రూ. 4లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఇంటింటికి వెళ్లి అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. రాజంపేట మండలంలోని పలు గ్రామాలలో 25 మంది బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి, మండల కమిటీ ఆధ్వర్యంలో అందించారు. లింగంపేట మండలం శెట్పల్లి గ్రామానికి చెందిన సువర్ణ సాయవ్వకు రూ. 36వేలు, బొడ్డు పోచయ్యకు రూ. 12,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణగౌడ్ అందజేశారు. నాగిరెడ్డిపేట మండలం బంజారతండాకు చెందిన బాధితుడు గన్యానాయక్‌కు మంజూరైన రూ. 60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎల్లారెడ్డి ఏఎంసీ డైరెక్టర్ నాగేశ్వర్ అందజేశారు.ఈకార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణాన్ని సోమవారం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను రథంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, శ్రీధర్ రావు,అర్చకులు డైరెక్టర్లు లక్ష్మి రాజం, రాజిరెడ్డి, ఆంజనేయులు గ్రామస్తులు ఉన్నారు.

పగలే వెలుగులు..



వీక్లీమార్కెట్‌లో వెలుగుతున్న విద్యుత్ దీపాలు



అయ్యప్ప నగర్‌లో..

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని 26వ వార్డు పరిధిలో పలు కాలనీల్లో వీధి దీపాలు నిరంతరంగా 24 గంటల పాటు వెలుగుతూనే ఉన్నాయి. వారం రోజులుగా పగలు, రాత్రి సమయాలలో వీధి దీపాలు వెలుగుతుండటంతో స్థానిక కాలనీవాసులు అవాక్కవుతున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం కొటొచ్చినట్లు కనిపిస్తోంది. ఇప్పటికే బల్దియా విద్యుత్ శాఖకు వీధి దీపాల బిల్లులు రూ. 8కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి.

క్రైం కార్నర్

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన ఉసికే లక్ష్మణ్ (45) అనారోగ్య కారణాలతో సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై జానీబాష తెలిపారు. లక్ష్మణ్‌కు 8ఏళ్ల క్రితం పెద్దపేగు సర్జరీ జరిగిందని, నాటి నుంచి తరచూ నొప్పితో బాధపడుతున్నాడన్నారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు లక్ష్మణ్ ఇంట్లో నుంచి వెళ్లగా దోమకొండ శివారులోని కుడి చెరువులో శవం లభ్యమైందని తెలిపారు. మృతుడి భార్య భవానీ ఫిర్యాదుతో శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంతానం కావడం లేదని..

నిజామాబాద్ రూరల్: పెళ్లై 20 ఏళ్లు గడుస్తున్నా సంతానం కావడం లేదని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ గ్రామానికి చెందిన సావిత్రికి వివాహం అయి 20 ఏళ్లు అవుతోంది. సంతానం కలగకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై గతంలో ఆత్మహత్యకు యత్నించింది. ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లిన సావిత్రి గ్రామ శివారులోని ఎర్రగుండ్ల చెరువులో దూకింది. సోమవారం చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మద్యానికి బానిసై ఒకరు..

కామారెడ్డి క్రైం: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని వాంబే కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన జొర్రీగల ఓం ప్రకాశ్ (51) ఓ కంపెనీలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. అప్పులు కూడా పెరిగాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన ప్రకాశ్ ఆదివారం రాత్రి బాత్రూంలో ఉపయోగించే యాసిడ్‌ను తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ప్రకాశ్‌ను జిల్లా జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి నిజామాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మృతుడి భార్య శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

దురలవాట్లకు బానిసై వివాహిత..

కామారెడ్డి క్రైం: దురలవాట్లకు బానిసై వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళి శ్రీవిద్య (23) కొంతకాలంగా భర్తతో గొడవపడి విద్యానగర్‌లోని తన సోదరి శ్రీమతితో కలిసి ఉంటోంది. చాలా రోజులుగా ఆమె కల్లు, గుట్కా, ఇతర చెడు అలవాట్లకు బానిసైంది. ఈ నెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె సోమవారం వేకువజామున తిరిగి వచ్చి గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. ఉదయం చూసే సరికి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరి శ్రీమతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవీపేట: మండలంలోని అల్జాపూర్ శివారులోని గోదావరి నదిలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. 40 నుంచి 45 ఏళ్ల వయసు గల వ్యక్తి, సుమారు మూడు రోజుల కిందట మరణించి ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి.. పాము కాటుకు బలి



బెస్త అశోక్ (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): చేపలవేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై మృత్యువాత పడిన ఘటన నాగిరెడ్డిపేట మండలం అచ్చాయపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని అచ్చాయపల్లి గ్రామానికి చెందిన బెస్త అశోక్(47)ఆదివారం గ్రామశివారులోని ఊర చెరువులో చేపలు పట్టేందుకు వల వేసి, చెరువు ఒడ్డున పడుకొని ఉండగా గుర్తు తెలియని పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే అశోక్‌ను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సోమవారం ఉదయం ఆస్పత్రిలో అశోక్ మృతిచెందినట్లు భార్య భారతి నాగిరెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

బాల్కొండ: మెండోరా మండలం సావెల్ శివారులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఏర్గట్ల మండలం దోంచంద గ్రామానికి చెందిన కోవత్రి గంగాధర్(46) మృతి చెందాడు. ఎస్సై యాసర్ ఆరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర్ సావెల్ గ్రామంలో తన బంధువు మైసమ్మ పండుగ చేయడంతో భోజనం కోసం వచ్చాడు. రాత్రి దోంచందకు బైక్‌పై తిరిగి వెళుతుండగా ఎదురుగా వెల్కటూర్ నుంచి సావెల్ వైపు వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి గంగాధర్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య కోవత్రి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెళ్లిలో భోజనం చేస్తూ ఒకరి మృతి



నరేశ్ మృతదేహం

భిక్కనూరు: పెళ్లిలో భోజనం చేస్తూ కుప్పకూలి ఒకరు మృతి చెందిన ఘటన కాచాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన గరిగంటి నరేశ్(33) స్నేహితులతో కలిసి మద్యం సేవించి కాచాపూర్ గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న వివాహానికి వెళ్లాడు. అక్కడ భోజనం చేస్తూ ఆకస్మికంగా కిందపడిపోయాడు. స్నేహితులు వెంటనే నరేశ్‌ను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అదుపుతప్పిన కారు

- పలు వాహనాలకు ఢీ
- 10 మందికి తప్పిన ప్రాణాపాయం



వాహనాలను ఢీకొని నిలిచిపోయిన కారు

ఆర్మూర్‌టౌన్: అదుపు తప్పిన ఓ కారు వరుసగా వాహనాలను ఢీకొన్న ఘటన ఆర్మూర్ పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లాకు చెందిన కొంతమంది ఎర్టిగా కారులో ఆదివారం ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి వెళుతున్నారు. ఆర్మూర్‌లోని దోండి మెడికల్ చౌరస్తా వద్ద అంక్సాపూర్‌కు చెందిన ప్రవీణ్ కారులో ఓ పేషెంట్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా వేగంగా వచ్చిన ఎర్టిగా కారు ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా శ్రీనివాస్ మందుల దుకాణం సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, అక్కడే నిలిపి ఉన్న ఓ బైక్‌తోపాటు ఓ స్కూల్ బస్సును కూడా ఢీకొట్టింది. ఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపోగా, అదృష్టవశాత్తు కారులో ఉన్న 10 మందికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారును స్టేషన్‌కు తరలించారు. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే కారులోని వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

ముంబై రోడ్లపై ఇందూరువాసి



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ముంబైలోని విక్ రోలీ వెస్ట్ ఫుట్‌పాత్‌పై ఉన్నట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు వ్యక్తి వాటర్, టీ తీసుకుంటున్నాడని, ఇంగ్లిష్ దినపత్రికలు చదువుతున్నాడని, అడ్రస్ అడిగితే నిజామాబాద్ అని చెబుతున్నాడని తెలిపారు. తెలిసిన వారు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

'డయల్ 100'ను దుర్వినియోగం చేసిన వ్యక్తికి జైలు

బోధన్: అత్యవసర సమయాల్లో వినియోగించుకోవాల్సిన 'డయల్ 100'ను దుర్వినియోగం చేసిన వ్యక్తికి బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు టౌన్ సీఐ వెంకటనారాయణ సోమవారం తెలిపారు. రాకాసీపేట ప్రాంతానికి చెందిన ఎండీ ఫారూఖ్ మద్యం మత్తులో డయల్ 100కు కాల్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేయడంతోపాటు దుర్వినియోగానికి పాల్పడినందున కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి శిక్ష విధించారని పేర్కొన్నారు. 'డయల్ 100'ను దుర్వినియోగం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ



బాధితురాలు లావణ్య

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జానకంపేట గ్రామానికి చెందిన మంగళ రవి కుటుంబం వేసవి ఉక్కపోత భరించలేక ఇంటి తలుపులు తెరిచి నిద్రించారు. దుండగుడు ఇంట్లోకి చొరబడి రవి భార్య లావణ్య మెడలో ఉన్న సుమారు రెండు తులాల పుస్తెలతాడును కత్తిరించి, పుస్తెలను అక్కడే వదిలేసి గొలుసు ఎత్తుకెళ్లాడు. అలికిడి శబ్దం విన్న లావణ్య మేల్కొని అరవడంతో దొంగ పరారయ్యాడు. ఎడపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగదాంబ ఆలయంలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని యాచారం తండా పరిధిలో ఉన్న జగదాంబ దేవి, సేవాలాల్ మహరాజ్ ఆలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. పూజారి రమేష్ సోమవారం ఉదయం పూజ చేసేందుకు ఆలయానికి వెళ్లగా తాళం పగిలి ఉంది. విషయాన్ని తండా పెద్ద మనుషులకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. 16 తులాల వెండి, 5 గ్రాముల మంగళసూత్రం, 6 మాసాల పట్టిగొలుసులు అపహరణకు గురైనట్లు పూజారి పేర్కొన్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం



దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామానికి చెందిన మిట్టపల్లి శ్రీనివాస్, చుక్కపురం శంకర్, చింతలపల్లి గోవర్ధన్ రెడ్డిలకు చెందిన 15 కేవీ, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఆదివారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్ చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. ఘటనపై ఏఈ పండరీనాథ్ సమక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు ట్రాన్స్‌ఫార్మర్లను అందించాలని బాధితులు కోరగా పైఅధికారులకు నివేదిక అందించి, వారం రోజుల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అందేలా చూస్తామని ఏఈ తెలిపారు.